అయితే ఆయన ఉన్నాడు అని చెపితే సరిపోదు. ఆయన పట్ల నీకు ప్రేమ ఉండాలి, భక్తి ఉండాలి. ఆయన పట్ల విశ్వాసం కలిగి ఉంటే, పరిపూర్ణమైన భక్తి కలిగి ఉంటే ఆయన పాదాలను ఆశ్రయిస్తే మనకు మాయ దారి ఇస్తుంది, అప్పుడు పరమేశ్వరుడు మనకు గోచరిస్తాడు. చేపలు పట్టేవాడు వల వేస్తాడు అనుకోండి. వాడి పాదాల దగ్గర ఉన్న చేపలు ఆ వలలో పడవు, వాడికి దూరంగా ఉన్న చేపలే ఆ వలలో పడతాయి. అలాగ ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఈశ్వరుడి మాయలో నీవు పడవు. ఇవి అన్నీ మీరు వింటే సరిపోదు, వీటిని ఇంటికి వెళ్ళి మననం చేయాలి. భక్తి అంటే చాలా తేలిక అని చాలామంది అనుకొంటున్నారు, భక్తి కూడా అంత తేలికగా రాదు. పూర్వ పుణ్యం లేకపోతే రంపం పెట్టి కోసినా వాడికి భక్తి రాదు. పూర్వ పుణ్యం ఉండాలి, భగవంతుడి దయ అనే కెరటం ఆయన పాదాల దగ్గరకు మనలను గెంటుకొని రావాలి కాని మన సాధనల వలన అక్కడికి మనం చేరుకోలేము, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడని విశ్వాసం పెట్టుకొని, భక్తిని సంపాదించుకొని, ఆయన పాదాలను ఆశ్రయిస్తే ఈ ప్రకృతి గుణాల నుండి, మాయలోనుండి బయటకు వచ్చి మనం తరించే అవకాశం ఉంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-11-2007, తణుకు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ సృష్టి అంతా వాసుదేవస్వరూపమే అని తెలిసినవాడికి పునర్జన్మ లేదు అని పరమాత్మ చెప్పాడు. ఈ సృష్టి అంతా కూడా వాసుదేవస్వరూపమే అని నోటితో చిలుకపలుకులు పలకటం కాదు, ఇదంతా వాసుదేవ స్వరూపమే అని గుర్తించినవాడికి పునర్జన్మ లేదు, మరి ఆ జన్మ ఎప్పుడు వస్తుందో చెప్పలేము. మహావిష్ణువును గాని, మహాదేవుడినిగాని మనం ఉపాసన చెయ్యాలి. అంటే ఆ నామాన్ని స్మరించటం, ఆ రూపాన్ని ధ్యానం చేయటం దానినే ఉపాసన అంటారు. ధ్యానం వలన మనకు ఏకాగ్రత వస్తుంది. లోపల అంతఃకరణ శుద్ధిఉంటేగాని భగవాన్ మాటలు అర్థం చేసుకోవటం కష్టం లేకపోతే తిరకాసు వచ్చేస్తుంది. కర్మసిద్ధాంతం నిజమే అంటారు. మనం పుణ్యం చేస్తే పుణ్యఫలం సుఖం, పాపం చేస్తే పాపఫలం దుఃఖం, ఇవి అనుభవిస్తే బయటకు పోతాయి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మీకు పరిస్థితులు బాగున్నాయి అనుకోండి పొంగిపోవద్దు, మీరు అనుకొన్న పనులు అవ్వటంలేదు అనుకోండి కుంగిపోవద్దు. మీరు గ్రహించవలసింది ఏమిటి

అంటే మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా ఇవి రెండూ దొంగనేనుకే. ఆ దొంగనేను మీరు కాదు. లోపల ఉన్న బ్రహ్మపదార్థానికి సంతోషం లేదు, దుఃఖం లేదు, వీటితో దానికి ఏమీ సంబంధం లేదు. మీకు సంతోషం వచ్చినప్పుడు పొంగిపోతూ ఉంటే, దుఃఖం వచ్చినప్పుడు కుంగిపోతూ ఉంటే వీటివలన దొంగనేను పెరిగిపోతుంది. అందుచేత దొంగ నేను ఉంటే కర్మ సిద్ధాంతంగాని దొంగనేను లేకపోతే కర్మసిద్ధాంతానికి విలువలేదు అని చెప్పారు. దొంగ నేనును దాటినవాడు కర్మసిద్ధాంతాన్ని దాటి వెళ్ళిపోతాడు, ఇంక వాడికి పునర్జన్మ లేదు. ఈ దొంగనేను ఏమి చేస్తుంది అంటే యింద్రియాల ద్వారా బయటకు వచ్చేసి విషయాలలో తిరుగుతూ ఉంటుంది. ఈ శరీరం ముసలిది అయిపోయిన తరువాత, ఇది పనికి రాదు అనుకొన్నప్పుడు కొత్త శరీరం కోసం చూస్తుంది. ఈ శరీరం చనిపోకముందే దొంగనేను చనిపోతే ఇంక మనకు కొత్తశరీరాలు రావు, అదే మోక్షం.

మనస్సు అంటేనే మాయ. అది రకరకాలుగా ఉంటుంది. ఒకోరోజున మనం మంచిగా ఉంటాము, ఒకోరోజున చెడుగా ఉంటాము, ఒకోసారి కోపంగా ఉంటాము. ఒకోసారి అందరికీ ఉపకారం చేయాలని అనిపిస్తుంది, వీరికి మనకు సంబంధం ఏమిటి వీరికి ఎందుకు మనం ఉపకారం చేయాలని ఒకోసారి అనిపిస్తుంది ఇలా మనస్సు రకరకాలుగా ఉంటుంది. మనస్సు ఎలా ఉంటుందో శాస్త్రంలో చెప్పారు అసలే అది కోతి, అది ఒకసారి కల్లు తాగింది, కల్లు తాగాక దానిని తేలుకుట్టింది, ఇంక ఆ కోతి ఎలా ఉంటుందో మన మనస్సు అలా ఉంటుంది అని చెప్పారు. వృక్షానికి మూలం బీజం, మనస్సుకు మూలం కామం అని చెపుతారు. చిన్న విత్తనంలో నుండి కొమ్మలు, రొబ్బలు, ఆకులు ఇలా పెద్ద వృక్షం వచ్చేస్తుంది. అలాగే కామ వాసనలో నుండి కోపం, అసూయ, ద్వేషం ఇలా పెద్ద మనస్సు వచ్చేస్తోంది. ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి అంటే మీకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా రావద్దు అని చెప్పకండి. దుఃఖం వచ్చినా ముట్టుకోవద్దు, సంతోషం వచ్చినా ముట్టుకోవద్దు. అప్పడు దొంగనేను చనిపోవటం ప్రారంభమవుతుంది. మీ ఇంట్లో వారి పరిస్థితి బాగుంది అనుకోండి, అందులో కలవకండి, వారి ప్రారబ్దాన్ని బట్టి వారు బాగున్నారు, వారి ప్రారబ్దం బాగా లేక ఎక్కువ కష్టాలు పడుతున్నారు అనుకోండి. మీకు చేతనైతే సహాయం చేయవచ్చు గాని అందులో కలవవద్దు, బెంగ పెట్టుకోవద్దు. మనకు జ్ఞానం రాకుండా అడ్డుపడే పెద్ద శత్రువు మమకారం. అందుచేత మనం ఎవరికైనా ఏదైనా సహాయం చేయవచ్చు గాని మమకారంతో చేయకూడదు. మమకారంతో చేస్తే అది మనలను

బంధిస్తుంది. అందుచేత మమకారాన్ని తగ్గించుకో అని శాస్త్రంలో చెప్పారు. అహంకారం, మమకారం వలన హృదయంలో ఉన్న ఆత్మ మనకు తెలియటం లేదు. అహంకారం అంటే నేను, మమకారం అంటే నాది. ఎవరికో ఒక రూపాయి ఇవ్వటం, లేకపోతే ఇల్లు కట్టిపెట్టటం, లేకపోతే బట్టలు కొని ఇవ్వటం ఇవన్నీ ధర్మం అని మనం అనుకొంటున్నాము, ఇది వ్యవహారికం. కాని భీష్ముడు ధర్మరాజుతో ఏమని చెప్పాడు అంటే నువ్వు విష్ణుసహస్రనామాలను శ్రద్ధగా చదువుకొని ఆ నామాల యొక్క అర్థాలను తెలుసుకొని మనం పాయసం నోటిలో ఎలా పోసుకొంటున్నామో అలాగ ఆ నామాలలో ఉన్న అర్థాలను నువ్వు జుర్రుకొంటూ ఉంటే నీ మనస్సు అణుగుతుంది, అది నిజమైన ధర్మం అని చెప్పాడు. అంటే నీ మనస్సు అణగటమే నిజమైన ధర్మం.

మీ ఇంట్లో ఎవరైనా అభివృద్ధిలోనికి వస్తే నా వలననే అభివృద్ధిలోనికి వచ్చారు అనుకొంటారు. మీరు ఏదైనా సహాయం చేయగలరు అంతే. మీ చేత సహాయం చేయించినవాడు భగవంతుడే. అది తెలియకపోవటం వలన నేను చేసాను, నేను చేసాను అనుకొంటున్నారు. ఈ నేను అనే బుద్ధిని భగవంతుడు తొక్కిపెట్టి ఉంచుతాడు. మేము ప్రాణాయామం చేస్తున్నాము, యాత్రలు చేసాము, యజ్ఞాలు చేసాము అంటే చేయటం మంచిదే కాని భగవంతుడు ఎక్కడైతే మిమ్మల్ని తొక్కిపెట్టి ఉంచాడో అందులో నుండి వాడి కాలు తీసేవరకు మీరు కోటి పుణ్యాలు చేసినా అందులోనుండి బయటకు రాలేరు. నేను పుణ్యం చేసాను, సుఖం వచ్చేస్తుంది, నేను స్వర్గలోకానికి వెళ్ళిపోతాను అనుకొనేవాడే గాని దేవుడిమీద గౌరవం ఎవరికి ఉంది, ప్రేమ ఎవరికి ఉంది, దేవుడి పాదాలను విడిచిపెట్టకూడదు అనే బుద్ధి ఎవరికి ఉంది, ఆ బుద్ధి మనకు లేనే లేదు. ఆయన దయ లేకుండా, ఆయన మీద మనకు గౌరవం లేకుండా ఈ పొరపాటులోనుండి మనం కోటిజన్మలు ఎత్తినా బయటకు రాలేము. మీ ఇంట్లో మిమ్మల్ని బాధలు పెడుతున్నారు అనుకోండి, సమాజపరంగా బాధలు వస్తున్నాయి అనుకోండి. ఎందుకు ఇలా బాధలు వస్తున్నాయి అంటే ఇది మీకు ఒక ట్రైనింగ్. వారు మిమ్మల్ని బాధపెడుతున్నారు అని భగవంతుడికి తెలుసు. ఆయన సర్వజ్ఞుడు, ఆయనకు తెలియని విషయం అంటూ ఏమీ లేదు. ఆ ట్రైనింగ్ మీకు లేదు అనుకోండి మనస్సుకు లోచూపు రాదు. మీకు బయట పరిస్థితులు బాగుంటే మంచిదే. మీకు వందకోట్ల డబ్బు ఉంది అనుకోండి, వంద చెరువులు తవ్వించారు అనుకోండి. మనస్సును బాగు చేసుకొనే పని మర్చిపోయారు అనుకోండి, ఇవన్నీ ఒకటి లేని సున్నలు. వీటి వలన మీకు పుణ్యం

వస్తుంది, అనుభవిస్తే అది పోతుంది. మీరు చేసే మంచిపనుల వలన మనస్సు బాగుపడాలి. ఏవో మంచి పనులు చేస్తున్నాముకదా, మనస్సు ఎలా ఉంటే ఆ గొడవ ఎందుకు? అందరూ మెచ్చుకొంటున్నారు కదా అంటే ఇక్కడ ఊరేగింపులు ఉంటాయి, స్మశానానికి వెళ్ళినప్పుడు వందమంది ఎక్కువ వస్తారు, పరలోకానికి వెళ్ళినప్పుడు మీ పని సున్న. మన మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన పని ఏమీ లేదు అన్న సంగతి మనకు తెలియటం లేదు, ఇది మనందరము చేస్తున్న పొరపాటు.

ఒక విషయం గుర్తుపెట్టుకొని మీరు అందరూ ఇంటికి వెళ్ళిపోవచ్చు. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. ఉన్న దానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇది నిశ్చయం. ఇవి మన బుద్ధికి అందని విషయాలు. ఉన్నది ఉన్నట్లుగా మనకు గోచరించి నప్పుడే అద్వైతానుభవం వస్తుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మనకు గోచరించకుండా సీతమ్మగా, ఎల్లమ్మగా, పుల్లమ్మగా, రాజుగారిలా, రెడ్డిగారిలా ఇలా రకరకాలుగా అది కనిపిస్తోంది అనుకోండి అప్పుడు ద్వైతం వస్తుంది. ద్వైతం ఎప్పుడైతే వచ్చిందో అక్కడ నుండి మాయ ప్రారంభమవుతుంది, మోహం ప్రారంభమవుతుంది. మీరు ఏదైనా పొరపాటు చేసారు అనుకోండి, పొరపాటు చేసినప్పుడు నాకు కోపం వచ్చేయవచ్చు. ఆ పొరపాటు నేనే చేసాను అనుకొంటే ఇంక కోపం రాదు, ఎందుచేత అంటే కోపం ఎక్కడ నుండి వస్తోంది, కామం ఎక్కడ నుండి వస్తోంది అంటే వేరుభావనలో నుండి వస్తోంది. మనందరం ఒక్కటే కాని భగవంతుడు మనకు వేరుబుద్ధిని కలుగజేసాడు, ఆ వేరుబుద్ధే మాయ. లేనిది ఉన్న దానివలె కనిపించటం వలన వేరుబుద్ధి వస్తోంది. ఉన్నది ఉన్నట్లుగా మనకు గోచరం అయ్యేవరకు లేనిది ఉన్నదానివలె మనకు కనిపిస్తుంది. మనందరం ఒక్కటే అనుకొన్నప్పుడు కోరిక లేదు, ద్వేషం లేదు, మోహం లేదు. మనందరం ఒక్కటే అని తెలియకపోవటం వలన చిరాకులు, పరాకులు అన్నీ వస్తున్నాయి. మీ బిడ్డ ఏదైనా పొరపాటు చేస్తే దాని వలన ఎక్కువ కోపం తెచ్చుకోరు, వాడికి టీచ్ చేసి అందులో నుండి బయటకు తీసుకొని రావటానికి ప్రయత్నం చేస్తారు. అదే ఇతరులు పొరపాటు చేస్తే దానిని పెద్దది చేసేస్తారు, అది మీ పాడుబుద్ధికి గుర్తు. అందుచేత మనం అందరం ఒక్కటే అనుకొంటే ఇటువంటి సమస్యలు అన్నీ పరిష్కారం అయిపోతాయి. మీకు పది రూపాయలు ఇవ్వటంకంటే, ఒక పూట అన్నం పెట్టటంకంటే, మీలో ఏదైనా ఒక బలహీనత ఉంటే ఆ బలహీనతలో నుండి మిమ్మల్ని విడిపించగలిగాను అనుకోండి ఇంతకంటే సత్కర్మ లేదు.

కలియుగం అంటే చీకటి యుగం మంచి చెడ్డగా కనిపిస్తుంది, చెడ్డ మంచిగా కనిపిస్తుంది. చేతులతో శివుడిని పూజించుకోండి, నోటినిండా హరినామం చేసుకోండి. దాని వలన ఈశ్వరుని దయ కలిగి విషయవాసనలలో నుండి బయటకు వచ్చేస్తారు. బుద్ధుడు ఏమన్నాడు అంటే నన్ను గురువు అంటున్నారు, ఏదో అవతారపురుషుడు అంటున్నారు, మీరు నదిని దాటటానికి నావను గెంటే నావికుడను అంటాడు. అజ్ఞానంలో నుండి జ్ఞానంలోనికి, అసత్యంలోనుండి సత్యంలోనికి దాటించే నావికుడు. దుఃఖంలో నుండి, అశాంతిలో నుండి బయటకు తీసుకొని రావటానికి ఆయన పని చేసాడు కాని వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అనేటువంటి జడ్జిమెంట్లు ఆయన ఏమీ చెప్పలేదు. ఎందుచేతనంటే ఆయనకు ప్రేమ తప్పించి ఏమీ తెలియదు. మనం ఇంట్లో విషయాలలో జాగ్రత్తగా ఉంటాము. దేవుడి దగ్గరకు వచ్చేటప్పటికి అజాగ్రత్తగా ఉంటాము. మనలను బాగు చేసుకొనే పరిస్థితి వచ్చేటప్పటికి అశ్రద్ధగా ఉంటాము. ఇందులో అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. ధర్మాన్ని ఆచరించాలి. ధర్మాన్ని ఆచరించకుండా నీవు ఏదో బుడబుక్కల మాటలు చెప్పటం వలన దొంగనేను చావదు. ఏదో యజ్ఞాలు చేసాము, యాగాలు చేసాము, సాధనలు చేస్తున్నాము ఈ దొంగ నేను బయటకు పోతుంది అంటే అది అలా బయటకు పోదు. ఈ దొంగ నేనును ఎవడైతే మన శరీరంలో తొక్కి ఉంచాడో వాడి అనుగ్రహం లేకుండా ఆ కాలు బయటకు తీయడు, ఆ కాలు తీస్తేగాని ఇది బయటకు పోదు. నువ్వు ధ్యానం చేయగా చేయగా ఏ నారాయణుడినైతే నీవు ధ్యానం చేస్తున్నావో ఆ ధ్యానమూర్తి నీ మనస్సునంతా ఆక్రమిస్తాడు. ధ్యానమూర్తి నీ మనస్సునంతా ఆక్రమించినప్పుడు, ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అది అణిగిపోతూ ఉంటుంది. అది అణిగిపోయి, అది ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో అక్కడకు వెళ్ళి కరిగిపోతుంది, అప్పుడు నీ హృదయంలో ఉన్న సత్యం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. స్వరూపసుఖం నీకు అందే వరకు ఈ చావులు పుట్టుకలు తప్పవు, విషయవాసనలు భరించటం తప్పదు, ఈ ద్వైత ప్రపంచంలో నుండి, ఈ ద్వంద్వాలలో నుండి మనం బయటకు వచ్చే అవకాశం లేదు.

దేహప్రారబ్ధాన్ని బట్టి ఈ శరీరం తిరుగుతూ ఉంటుంది. నీ శరీరం ఎక్కడ తిరుగుతూ ఉన్నా నువ్వు ఏ రూపాన్ని అయితే ధ్యానం చేస్తున్నావో మనస్సును దాని మీద నిలబెట్టి ఉంచు. మాట ఏదైనా అంటే ఆ మాటను పోషించుకొనే వాడు రాముడు. ఒక మాట పోషించుకోవటానికి రాజ్యాన్ని కూడా వదిలేసాడు. వాడు రాముడు. రాముడు ధర్మాన్ని

ఆచరించటం కాదు, ఆయన స్వరూపమే ధర్మం. పెద్ద పెద్ద యోగాభ్యాసాలు అక్కరలేదు, మనం ప్రేమతో రాముడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన రూపాన్ని ధ్యానం చేసుకొంటూ ఉంటే మన ఇంద్రియాలు, మనస్సు అణగిపోతాయి. రాముడు ఉన్న చోట కాముడు ఉండడు, రాముడు లేని చోట కాముడు ఉంటాడు అని స్వామీజీ చెప్పారు. అందుచేత మీ హృదయంలోనికి రాముడిని ఆహ్వానించుకొంటే ఇంక కాముడు అక్కడ ఉండడు. రాముడు మీ హృదయంలో లేడు అనుకోండి, అక్కడ కాముడు ఉంటాడు. నాకు సీతారాములకంటే లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి మీద గౌరవం ఎక్కువ. ఎందుచేతనంటే చిన్న కోరిక లేకుండా వారు రాముడికి సేవ చేసారు. శరణాగతికి వీరు ఇద్దరు గుర్తు. వీరిద్దరికి సేవాభావం తప్పించి యింక ఏమీలేదు. ఇంద్రియనిగ్రహానికి, మనోనిగ్రహానికి, చిత్తశాంతి కలగటానికి రామనామం చాలు. మనం రామనామం చేసుకొంటున్నాము అనుకోండి. ఎవరికైనా ఏదైనా కలిసివచ్చింది అనుకోండి, మనకు ఏమీ కలిసి రాలేదు అనుకోండి, అయినా కూడా మనస్సులో మనకు ఏమీ అనిపించదు, అది రామనామం యొక్క వైభవం. రామనామం చేసేవాడికి వారు బాగుపడిపోతున్నారు, నేను వెనకబడిపోతున్నాను అనే తలంపులు రావు.

మాకు విశ్రాంతి లేదు, మాకు విశ్రాంతి లేదు అని కొంతమంది అంటూ ఉంటారు. నిజంగా మీకు విశ్రాంతి కావాలంటే రామనామం చేసుకోండి. మిమ్మల్ని ఏవైనా వాసనలు పీడిస్తున్నాయి అనుకోండి హృదయపూర్వకంగా రామనామం చేసుకోండి. పులిని చూసి మేకలు, మనుషులు ఎలా పారిపోతారో అలాగ రామనామం చేసుకొంటూ ఉంటే మీలోపల గూడు కట్టుకొనిఉన్న వాసనలు అన్నీ పారిపోతాయి. ఏనుగులాంటి బలమైన జంతువుకు సింహం ఎటువంటిదో కామంలాంటి బలమైన శత్రువుకు రాముడు అటువంటి వాడు. మనలను రక్షించేది రామాయణం అని చెపుతారు. భగవాన్ ఒకమాట చెప్పారు, ఎన్ని పుస్తకాలు చదివినా యిదే సారం. నీ సంకల్పమే నెరవేరుగాక. మనం ఏదైనా సంకల్పించినా భగవంతుడి సంకల్పమే నెరవేరుతుంది. మనం ఏదీ సంకల్పించకపోయినా భగవంతుడి సంకల్పం ఉంటే ఆ పని జరిగిపోతుంది. అందుచేత భగవంతుడి సంకల్పమే నెరవేరుగాక, ఆయన ఇష్టమే నెరవేరుగాక. ఎందుచేతనంటే అసలు మనం అంటూ లేము. ఉన్నది భగవంతుడు ఒక్కడే. ఉన్నది ఆయన ఒక్కడే కాబట్టి ఆయన ఇష్టాన్ని బట్టి ప్రతీదీ జరుగుతుంది కాని ఆయన ఇష్టానికి భిన్నంగా, ఆయన సంకల్పానికి భిన్నంగా ఈ సృష్టిలో ఏదీ జరగటానికి వీలు లేదు, జరగదు. ఉన్నది ఆయన ఒక్కడే, ఈ జీవుడు అనేవాడు కల్పితం. మాయ

ఎక్కడ ఉంది అంటే ఆ మంచిపని చేయాలి, ఈ మంచిపని చేయాలి అని మనం అనుకొంటాము, ఏదో ఊహించుకొంటాము, ఏవో ఆలోచనలు, తలంపులు వస్తూ ఉంటాయి. అది సాధించాను, ఇది సాధించాను అని తొంబై అనుకొంటాము. చివరకు ఏ పనీ చేయకుండా, ఏదీ సాధించకుండా చనిపోతున్నాము. ఇదే మాయ.

శబరి రాముడి దగ్గరకు వెళ్ళలేదు. రాముడే వెతుక్కొంటూ శబరి దగ్గరకు వెళతాడు. దేవుడి దగ్గరకు నీవు వెళ్ళనక్కరలేదు, ఆయనే నీ దగ్గరకు వస్తాడు, నీ అర్హత అటువంటిది అని శబరి గురువుగారు ఆమెకు చెప్పారు. అలాగే మనకు అర్హత ఉంటే, పుణ్యబలం ఉంటే గురువే వెతుక్కొంటూ మన దగ్గరకు వస్తాడు. నీ దేహం ప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి చేస్తూ ఉంటుంది. కాని మనస్సుతోమటుకు భగవంతుడిని స్మరించుకో, భగవంతుడిని ధ్యానం చేయటం మానవద్దు. భగవంతుడు చెప్పే విషయాలను శ్రద్ధగా విను, వాటిని మననం చేసుకో. భగవంతుడు చెప్పిన మాటలు అబద్ధం వలె నీకు కనిపిస్తాయి. అవి అబద్ధం కాదు. నీలో ఉన్న కర్మవాసనలు వాటిని అబద్ధంలాగ కనిపింప జేస్తాయి. ఇదే మాయ. భగవంతుడు సత్యం చెపితే అది అసత్యం అని నువ్వు అనుకొంటున్నావు, అలా అనుకోవటమే మాయ. మనస్సును విడిచిపెట్టి మాయలేదు. ఆ మాయనే నేను నేను అనుకొంటున్నావు. గురువునుగాని, ఒక అవతారపురుషుడిని గాని తీసుకొని ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన నామాన్ని స్మరించుకొంటూ ఉంటే ఆయన రూపము, నామము వచ్చి నీ మనస్సును ఆక్రమించుకొంటాయి. అప్పుడు నెమ్మదిగా విషయవాసనలు, కర్మ వాసనలు పోతాయి. ఎప్పుడైతే ఈ వాసనలు పోయినాయో దొంగనేనుకు బలం తగ్గిపోతుంది, ఇంక దానికి మేత దొరకక అది ఎక్కడ నుంచి అయితే వచ్చిందో అక్కడికి వెళ్ళి నశిస్తుంది. అప్పుడు నీకు స్వరూపసుఖం తెలుస్తుంది. అచ్యుత, అనంత, గోవింద. గోవిందుడిని స్మరించుకోవటం వలన, ఆయనను ధ్యానించటం వలన, గోవిందుడికి నమస్కారం పెట్టటం వలన కోటి జన్మల్లో ఉన్న పాపం నశిస్తుంది అని చెపుతారు. అంటే కోటి జన్మల నుండి వస్తున్న దోషాలు, వాసనలు, ఆ పాపరాశి ఎంత ఉన్నా గోవిందుడి దయ వలన అంతా కాలిబూడిద అయిపోతుంది. వాడే గోవిందుడు, వాడే నారాయణుడు. నువ్వు అన్ని విధముల ప్రయత్నం చేసి, సాధనలు చేసి, నీకు ఉన్న అన్ని అవకాశములను ఉపయోగించుకొని నారాయణుడిని స్మరించటంకంటే, ఆయనను ధ్యానం చేయటం కంటే నీకు పెద్ద పని ఏముంది అంటున్నారు, అంటే అదే ముఖ్యమైన పని.